# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
30-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 12

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## బిఆర్ఎస్ ఆర్థిక మూలాలపై గురి!



గత పదేళ్లుగా మైనింగ్ అనుమతులపై సిఐడి విచారణ

మంత్రి పొంగులేటి పై గులాబీ పార్టీ ఆరోపణ

దానిని తిప్పి కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ రాజకీయాల్లో సీఎం రేవంత్ వ్యూహం పకడ్బందీగా అమలవుతోంది. ముఖ్యంగా గులాబీ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై గులాబీ పార్టీ గత కొంతకాలంగా ఆరోపణలు చేస్తూనే ఉంది. మైనింగ్ అవినీతి జరుగుతోందని ఫిర్యాదులు చేస్తోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

రేవంత్ సర్కారును డిఫెన్స్ లో పెట్టే ప్రయత్నాలు చేసింది. ఈ తరుణంలో రేవంత్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. సొంత మంత్రి వారిపై విచారణకు ఆదేశిస్తూనే.. 2014 నుంచి

- మిగతా 2వ పేజీలో




## చండూర్ రాజకీయంలో

మిగతా 2లో

# ముడుపుల పోటు....

### పార్టీ నిబద్ధతను మింగేసిన నోట్ల కట్టలు

### సొంత గూటికే కన్నం వేసిన వెన్నుపోటు దారులు.!

చండూర్ మున్సిపల్ ఎన్నికల రాజకీయం ఇప్పుడు నైతిక విలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజా సేవ ముసుగులో కొందరు నేతలు సాగిస్తున్న, అంగడి రాజకీయం అధికార పార్టీలో మునుపెన్నడూ లేని విధంగా, అంతర్గత కుమ్ములాటలకు దారితీసింది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, పార్టీ క్రమశిక్షణ కోసం తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగించి నామినేషన్ల ను విత్‌డ్రా చేయించారు.

ఆ త్యాగం వెనుక కొందరు నేతలు లక్షలాది రూపాయలను, బేరసారాలు సాగించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):**

వసూళ్ల పర్వం.. అభ్యర్థులకు చుక్కలు! .. బిఫామ్ దక్కకపోయినా నామినేషన్లు వేసిన కొందరు నాయకులు, ఎమ్మెల్యే మాటకు గౌరవం ఇచ్చి తప్పుకుంటున్నట్లు బయటకు కలరింగ్ ఇచ్చారు.! కానీ, తెరవెనుక మాత్రం వార్డు అభ్యర్థుల నుంచి, లక్షల రూపాయలు వసూలు చేసినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.! ఇప్పటికే ఎన్నికల ఖర్చుతో సతమతమవుతున్న అభ్యర్థులను, మేము విత్‌డ్రా కావాలంటే ఇంత ఇచ్చుకోవాల్సిందే అంటూ బ్లాక్ మెయిల్ చేసి మరీ, భారీ మొత్తాలు కాజేసినట్లు సమాచారం. గెలుపు కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అభ్యర్థులు అడిగినంత ఇచ్చుకున్నా, చివరకు ఫలితాల్లో వారికి వెన్నుపోటు తప్పలేదు.!? ఇక్కడే అసలు ద్రోహం వెలుగుచూసింది. సొంత పార్టీ అభ్యర్థి నుంచి విత్‌డ్రా ఖర్చులు వసూలు చేసిన కొందరు నేతలు, అంతటితో ఆగకుండా ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా, భారీగా ముడుపులు అందుకున్నట్లు తెలుస్తోంది.!

## నీట మునిగి 8 మంది మృతి

4లో

తకెళ్లి ఆరుగురు, చెరువులో మునిగి ఇద్దరు

వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

కొండపాక (గజ్వేల్): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో



## ఎంతో కొంత కళా పోషణ ఉండాలి

శాసనసభ్యుల క్రీడా సాంస్కృతిక పోటీల ముగింపు సభలో సీఎం రేవంత్ రెడ్డి

విపక్ష సభ్యులు వచ్చే ఏడాదైనా క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచన



గన్ ఫౌండ్రీ (హైదరాబాద్): మనిషన్నాక ఎంతో కొంత కళాపోషణ



4లో

## అమెరికా స్థావరాలపై నిప్పుల వర్షం

పశ్చిమాసియాలో మోహరించిన అమెరికా జవాన్లు

ఇప్పటికే సిద్ధంగా 50 వేల మంది

మరో 10 వేల మంది తరలింపు!

ఎందరొచ్చినా మసి చేస్తాం: ఇరాన్

## గూడెం మహిపాల్ రెడ్డి

# యూ టర్న్?!

### తిరిగి గులాబీ గూటికి పటాన్ చెరు ఎమ్మెల్యే

- అసెంబ్లీలో మద్దతు తెలిపిన హరీష్ రావు
- తిరిగి పార్టీలో చేర్చుకునేందుకు బిఆర్ఎస్ నాయకత్వం గ్రీన్ సిగ్నల్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి కారు ఎక్కబోతున్నారా? హస్తం పార్టీకి గుడ్ బై చెప్పనున్నారా? ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫిర్యాదులు ఆయన పేరును గులాబీ పార్టీ ఎందుకు మినహాయించింది? మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కుటుంబం ఎందుకు మౌనంగా ఉండిపోయింది? తాజాగా అసెంబ్లీ వేదికగా హరీష్ రావు అతనిని ఎందుకు వెనుకేసుకొచ్చారు?

- మిగతా 2వ పేజీలో





# ఆ భూమి ఎవరిది?

### కొత్వాల్ గూడ శివారులోని భూములపై వివాదం

### 350 ఎకరాల్లో రాఘవ కన్స్ట్రక్షన్స్ క్రషర్ ఏర్పాటు

- ప్రభుత్వ భూమిగా చెబుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్
- మంత్రి పొంగులేటి కబ్జాకు యత్నిస్తున్నట్లు ఆరోపణ
- అసైన్డ్ రైతుల వద్ద లీజుకు తీసుకున్నామంటున్న కంపెనీ
- అసెంబ్లీని కుదిపేస్తున్న భూముల వ్యవహారం

2లో

# డి లిమిటేషన్‌తో తెలంగాణలోకి టిడిపి ఎంట్రీ!




గ్రేటర్ లో గ్రాండ్ గా ప్లాన్ చేస్తున్న చంద్రబాబు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో పెరగనున్న నియోజకవర్గాలు

ఖమ్మం..నల్గొండలో సైతం

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పోటీ

డీ లిమిటేషన్ తో తెలంగాణలో ఎవరికి లాభం? అధికార కాంగ్రెస్ పార్టీ కా? లేకుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కా? లేకుంటే గులాబీ పార్టీకా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. అయితే ఊహించని సమాధానం వస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన తో ఎక్కువగా లాభపడేది తెలుగుదేశం పార్టీ అని ప్రచారం ప్రారంభం అయ్యింది. విశ్లేషకులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

# ఆ భూమి ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి)

**శాసనసభను రెండు మూడు రోజులుగా ఒకే అంశం కుదిపేస్తోంది. అది చివరికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి రెండు రోజులపాటు సస్పెండ్ చేసేదాకా దారితీసింది. కొత్వాల్ గూడ గ్రామ శివారులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ కంపెనీ నిర్వహిస్తున్న క్రషర్ ఈ వివాదానికి కారణమైంది. ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తున్నందుకు మంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేయడం, దీనికి అధికార పక్షం ఎదురుదాడి చేయడంతో అసెంబ్లీ అట్టుడుకుతోంది.**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రెవెన్యూ మండల పరిధిలోని కొత్వాల్‌గూడ సర్వేనంబర్ 55-63, 65-68, 70-72ల్లో 350 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వేనంబర్లలోని భూమిని 1978లో కొత్వాల్‌గూడకు చెందిన కొందరు పేద రైతులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 200 ఎకరాలను అసైన్డ్ చేశారు. అప్పట్లో కొండలు, గుట్టలు ఉండటంతో వ్యవసాయానికి అనుకూలించదంటూ అసైనీలు ఆ భూములను వాడుకలోకి తీసుకోలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం తిరిగి పీవోటీ యాక్టు ప్రకారం ఆ భూములను 2008లో స్వాధీనం చేసుకుందని బీఆర్ఎస్ చెబుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ భూముల్లో పెద్ద టౌన్‌షిప్స్, కమర్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో 2008లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం హౌసింగ్ బోర్డు ద్వారా 'దక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డిం గ్స్' (దిల్) కంపెనీకి 350 ఎకరాలు కేటాయించిందని అంటోంది. కానీ దిల్ కంపెనీ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో కేసీఆర్ ప్రభుత్వం



నిరుపయోగంగా ఉన్న ఈ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుందని అంటున్నారు.

**లీజుకు ఇచ్చామంటున్న అసైనీలు..**

1978లో ఈ భూములను పొందిన అసైనీల వాదన మాత్రం మరోలా ఉంది. కొత్వాల్‌గూడలోని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కు తమ భూములను లీజుకు ఇచ్చామని వారు చెబుతున్నారు. ప్రెస్ మీట్ పెట్టి మరీ.. ఈ విషయాన్ని వెల్లడించారు. క్రషర్ ద్వారా తమ బతుకులు బాగుపడుతున్నాయని చెప్పారు. మరోవైపు ఈ రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు తాము ఇక్కడ క్రషర్ ఏర్పాటు చేసి వారికి లీజు కింద డబ్బులిస్తున్నామని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రకటించింది. ప్రతిపక్షం తమపై కావాలనే బురద చల్లుతోందని ఆరోపించింది. అయితే సదరు అసైనీల నుంచి ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పీవోటీ కింద ఆ భూముల్ని స్వాధీనం చేసుకుందని బీఆర్ఎస్ అంటోంది. పాత అసైనీలకు దశాబ్దాల కిందట భూములు పంపిణీ చేసిన సమయంలో ఇచ్చిన పట్టాలోనూ.. లీజు, ఆర్థిక లావాదేవీల కింద క్రయ విక్రయాలు చేసుకోవద్దనే నిబంధన పొందుపరిచిందని గుర్తు చేస్తోంది. దీంతో అసలు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్కడ క్రషర్ ఏర్పాటు చేయడమే అక్రమమని, అటు లీజుకిచ్చే అధికారం పాత అసైనీలకు లేదని చెబుతోంది. ఇటు ప్రభుత్వం నుంచి భూ కేటాయింపులు కూడా లేనందున ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా అక్రమ క్రషర్ ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

### భూములను కాజేసే పన్నాగం..?

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పాత అసైనీలను తెరపైకి తెచ్చి.. వారి వద్ద ఉన్న పాత పాస్ పుస్తకాలను అడ్డు పెట్టుకొని రాత్రికి రాత్రి భూ భారతిలో రికార్డుల్ని తారుమారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. పాత అసైనీలను కొంతమందిని ఒక్కొక్కరుగా కలిసి వారి నుంచి పాత పాస్ పుస్తకాలతో పాత తేదీల్లో ఒక్కొక్కరి నుంచి 33 సంవత్సరాల లీజు అగ్రిమెంట్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా దశాబ్దాల కిందట ఉన్న పాత అసైనీలు అందరి నుంచీ లీజు ఒప్పందాలు చేసుకొని ఏదో ఒక తిరకాసుతో రికార్డుల్లోకి ఎక్కించాలనే భారీ పన్నాగం ఈ క్రషర్ ఏర్పాటు వెనుక ఉందని అంటున్నారు. ఇదే అంశాన్ని శాసనసభలో లేవనెత్తిన బీఆర్ఎస్ సభ్యులు.. ఈ అక్రమానికి నైతిక బాధ్యత వహిస్తూ.. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ పై హౌస్ కమిటీ వేయాలని పట్టుబట్టారు. ఇందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో సభను నడవనీయకుండా నిరసన తెలిపారు. రోజంతా కొనసాగిన నిరసన నేపథ్యంలో బీఆర్ఎస్ సభ్యులను ఈ బడ్జెట్ సమావేశాలు జరిగే రెండు రోజులపాటు సస్పెండ్ చేశారు.

# చండూర్ రాజకీయంలో ముడుపుల పోటు....

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ జెండాను భుజాన వేసుకునే తిరుగుతూనే, లోపాయికారిగా విపక్ష అభ్యర్థులకు ఓట్లు మళ్లించేలా డబుల్ గేమ్ ఆడటంతో, అధికార పార్టీ అభ్యర్థులు బలిపశువులయ్యారు. డబ్బు కోసం పార్టీ సిద్ధాంతాలను, నాయకత్వ నమ్మకాన్ని, తాకట్టు పెట్టిన ఈ నేతల తీరుపై కార్యకర్తలు మండిపడుతున్నారు. కొన్ని వార్డుల్లో వచ్చిన అనూహ్య ఫలితాలు, క్షేత్రస్థాయిలో జరిగిన ఈ ఆర్థిక లావాదేవీల చిట్టా ఇప్పుడు, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వద్దకు చేరినట్లు తెలుస్తోంది.? నమ్మించి గొంతు కోసిన నేతలెవరు? పార్టీ ప్రతిష్టను బజారున పడేసి, ముడుపులకు మరిగిన ద్రోహులెవరు? అనే కోణంలో ఆయన ఇప్పటికే ఒక నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.! రానున్న సమీక్షా సమావేశాల్లో ఈ వెన్నుపోటు రాజకీయాలపై, కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. డబ్బు ముందు పార్టీ కట్టుబాట్లు పనికిరావు అనుకునే నేతలకు, రాజకీయ సమాధి కట్టేలా ఎమ్మెల్యే యాక్షన్ ప్లాన్ ఉండబోతోందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

# బిఆర్ఎస్ ఆర్థిక మూలాలపై గురి!

(మొదటి పేజీ తరువాయి)



అనుమతులు పొందిన అన్ని క్వారీలపై విచారణకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ నేతలు వణికి పోతున్నారు.

**తిప్పి కొట్టిన వైనం..**

తన క్యాబినెట్ సహచరులపై అవినీతి అస్త్రాలను గులాబీ పార్టీ ప్రయోగించింది. కానీ ఆ అస్త్రాలను వారిపైనే తిరిగి ప్రయోగించారు సీఎం రేవంత్ రెడ్డి. కేవలం తన సహచర మంత్రిని సమర్థించుకోవడమే కాదు.. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మైనింగ్ అక్రమాల చిట్టాను బయటికి తీసేలా సిఐడి విచారణకు ఆదేశించారు. ఇది నిజంగా రాజకీయ మలుపు. ఎత్తుకు పై ఎత్తు వేసే విధానం రేవంత్ రెడ్డి నుంచి స్పష్టంగా అర్థమవుతోంది. రాజకీయ వ్యూహాత్మక ఎత్తుగడ కనిపిస్తోంది. కెసిఆర్ కు మించి వ్యూహ కర్తగా రేవంత్ రెడ్డి అవతరించారు. సాధారణంగా ప్రభుత్వంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తే డిఫెన్స్ లో పడిపోతారు. కానీ రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి చెందిన రాఘవ కన్స్ట్రక్షన్ పై హరీష్ రావు లాంటి నేతలు ఆరోపణలు చేసినప్పుడు.. బ్లాక్ మెయిలింగ్ పాలిటిక్స్ గా కొట్టిపారేశారు. అంతటితో ఆగకుండా 2014 జూన్ 2 నుంచి క్వారీ అనుమతులు, మైనింగ్ లీజులు, కంకర తవ్వకాలు వంటి వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్స్ కు కీలక ఆదేశాలు ఇచ్చారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి గులాబీ పార్టీ నేతలను డిఫెన్స్ లో పెట్టేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో గులాబీ పార్టీ నేతలు గుబులు రేగుతోంది.

**ఆదాయ వనరుపై ఫోకస్..**

ప్రధానంగా కేసీఆర్ పార్టీకి ఆదాయ వనరుగా లీజుల వ్యవహారమే ఉందని ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ప్రధానంగా మైనింగ్ ఆదాయంతోనే ఆ పార్టీని నడిపారని.. తెలంగాణ వ్యాప్తంగా అడ్డగోలుగా మైనింగ్ లీజులు ఇచ్చారని విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా కరీంనగర్, ఖమ్మంలో ఈ లీజు వ్యవహారాలు అధికంగా నడిచాయన్న ఆరోపణలు ఉన్నాయి. బిఆర్ఎస్ హయాంలో లీజుల అనుమతులు పొందిన వారంతా ఇప్పుడు ఆందోళనతో గడుపుతున్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ కు చెందిన శ్వేత గ్రానైట్స్, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర కు చెందిన గాయత్రీ గ్రానైట్స్ పై ఇప్పటికే ఈడి నిఘా ఉంది. దీనికి రాష్ట్ర దర్యాప్తు సంస్థ సిఐడి తోడైతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని ఆందోళన కనిపిస్తోంది. పాత బకాయిలతో పాటు రాయల్టీ ల ఎగవేతలను కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది. తద్వారా కొంతమంది గులాబీ పార్టీ నేతలు డిఫెన్స్ లో పడతారు. ఒక్క మంత్రి కోసం కోరితే పదుల సంఖ్యలో గులాబీ పార్టీ నేతలు ఇప్పుడు బుక్ అవుతున్నారు.

**మంత్రిని కాపాడుకుంటూనే..**

తన క్యాబినెట్ సహచరుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాపాడుకునే.. గులాబీ పార్టీ నేతలను డిఫెన్స్ లో పడేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఇప్పటికే రాఘవ కన్స్ట్రక్షన్స్ పై చర్యలు తీసుకున్నామని... అపరాధ రుసుము వసూలు చేశామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఈ సిఐడి విచారణ పూర్తయ్యేనాటికి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి క్లీన్ చీట్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు గులాబీ పార్టీకి మైనింగ్ మాఫియా ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఇప్పుడు ఆ ఆర్థిక మూలాలను దెబ్బతీసేలా రేవంత్ వ్యూహం ఉంది. దాదాపు అన్ని రకాల మాఫియాలు గులాబీ పార్టీ నేతల కనుసనల్లో నడిచాయని గత పదేళ్లుగా అనేక రకాల ఆరోపణలు ఉన్నాయి. కానీ ఇప్పుడు కేవలం ఒక మంత్రిపై ఆరోపణలు చేసి గత పదేళ్లుగా తెలంగాణలో జరిగిన అవినీతిని బయటకు తీసేలా చేశారు గులాబీ పార్టీ నేతలు. ఇది సెల్ఫ్ గోల్ అని ఆ పార్టీలో ఒక రకమైన కామెంట్స్ వేపిస్తున్నాయి. మరోవైపు రేవంత్ వ్యూహాత్మక అడుగులు పై తెలంగాణలో బలమైన చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కేవలం కేసీఆర్ మాత్రమే రాజకీయ వ్యూహకర్త అని అంతా భావించారు. కానీ అంతకుమించి రేవంత్ వ్యూహాలు ఉన్నట్లు అర్థమవుతోంది.

# గూడెం మహిపాల్ రెడ్డి యూ టర్న్?!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష ఎమ్మెల్యే అని ఎందుకు సంబోధించారు? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో దీనిపై జోరుగా చర్చ నడుస్తోంది. త్వరలో మహిపాల్ రెడ్డి కారు ఎక్కడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే పరిణామాలు ఉన్నాయి.

కాంగ్రెస్ లోకి ఫిరాయింపు..

మొన్నటి ఎన్నికల్లో పటాన్ చెరు నుంచి ఎమ్మెల్యేగా గులాబీ పార్టీ నుంచి గెలిచారు. కానీ ఓ పదిమంది ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే గత కొంతకాలంగా మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలా పాలకు దూరంగా ఉన్నారు. ఆయన వ్యవహార శైలిలో సైతం స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. దీనికి చాలదు అన్నట్టు ఆయనకు అసెంబ్లీలో బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు వెన్నుదన్నుగా నిలవడం.. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలను తిప్పి కొట్టడం.. ప్రతిపక్ష ఎమ్మెల్యే అంటూ సంబోధించడం వంటివి చూస్తుంటే మాత్రం మహిపాల్ రెడ్డి తిరిగి గులాబీ గూటికి చేరడం ఖాయమని తెలుస్తోంది. త్వరలోనే ఆయన బిఆర్ఎస్ లో చేరిపోతారని కూడా పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం ఉంది.

**మున్సిపల్ ఎన్నికల్లో సహకారం..**

అనుకోని రీతిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు మహిపాల్ రెడ్డి. కానీ అక్కడ ఉండేందుకు పెద్దగా ఆయన మనస్సు అంగీకరించడం లేదని తెలుస్తోంది. అందుకే తిరిగి గులాబీ పార్టీలో చేరుతానని సంకేతాలు ఇచ్చారు. అదే సమయంలో ఆశించిన స్థాయిలో సానుకూలత రాలేదు గులాబీ బాస్ నుంచి. అయినా సరే తన సోదరుడితో పాటు కుమారుడిని బిఆర్ఎస్ లో ఉంచి.. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీకి తెరవెనుక సాయం చేశారు అన్నది మహిపాల్ రెడ్డి పై ఉన్న ప్రధాన ఆరోపణ. అయితే తిరిగి మహిపాల్ రెడ్డిని పార్టీలో చేర్పించేందుకు గులాబీ పార్టీ నేతలు కూడా సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. మహిపాల్ రెడ్డి పై అసెంబ్లీలో మైనింగ్ ఆరోపణలు రాగా అండగా నిలిచారు హరీష్ రావు. పైగా కేటీఆర్ తో కూడా మహిపాల్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే మాత్రం తిరిగి ఆయన కారు ఎక్కడం ఖాయమని తేలిపోయింది. అయితే అది ఎప్పుడు అన్నది తెలియడం లేదు. అయితే కచ్చితంగా మహిపాల్ రెడ్డి మాత్రం తిరిగి గులాబీ పార్టీలో చేరిపోతారని మాత్రం పొలిటికల్ సర్కిల్స్లో తెగ ప్రచారం నడుస్తోంది.

### పట్టున్న నాయకుడు కావడంతో..

పటాన్ చెరు నియోజకవర్గంలో మంచి పట్టున్న నేత మహిపాల్ రెడ్డి. ఒక సాధారణ ఎంపీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనతి కాలంలోనే ఎదిగారు. వరుసగా మూడుసార్లు గులాబీ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. 2018లో రెండోసారి విజయం సాధించారు. 2023లో మూడోసారి సైతం కాంగ్రెస్ ప్రభంజనాన్ని తట్టుకొని నిలబడ్డారు. అయితే వివిధ కారణాలతో ఆయన కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. కానీ తిరిగి వచ్చేస్తానని గులాబీ పార్టీకి సంకేతాలు పంపారు. అందుకే అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ లో మహిపాల్ రెడ్డి పేరు లేదు. తద్వారా గులాబీ పార్టీ కూడా ఆయన విషయంలో సానుకూలంగా ఉందని తెలుస్తోంది. త్వరలో ఆయనను తిరిగి పార్టీలో చేర్చుకోవడం ఖాయంగా ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# టీఎన్జీఓ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్

## ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ ఎన్నిక

హైదరాబాద్: తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికా రుల సంఘం అధ్యక్షు డిగా మారం జగ దీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ నియ మితుల య్యారు. ఆదివారం గచ్చిబౌలిలోని టీఎన్జీఓ హౌసింగ్ సొసైటీ ఆవరణలో ఎన్నికల అధి కారి సుగుణాకర్ రెడ్డి, సహాయ ఎన్నికల అధి కారి సురేశ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. అధ్యక్ష పదవికి ఒకేఒక్క నామినేషన్ రావడంతో మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి ఎన్నిక కూ డా ఏకగ్రీవం అయింది. కార్యవర్గ సభ్యులుగా 17మంది నామినేషన్ దాఖలు చేయడంతో వారిని నియమించారు.




# డి లిమిటేషన్‌తో తెలంగాణలోకి టిడిపి ఎంట్రీ!

అందుకు కారణాలను చెబుతున్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి ఆయాచిత లబ్ధి చేకూరనుంది అనేది విశ్లేషకుల మాట.

**కేంద్రంలో కీరోల్..**

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజనతో ఏపీలో లాభపడేది కూటమి. తమకు నచ్చిన విధంగా నియోజకవర్గాల మార్పు, రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం. అయితే తెలంగాణలో పూర్తిగా అస్తిత్వాన్ని కోల్పోయిన తెలుగుదేశం.. మరోసారి బతికేందుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ దోహదపడుతుంది అనేది విశ్లేషకుల మాట. కేవలం ఆంధ్ర సెటిలర్స్, టిడిపికి బలమైన కార్యకర్తలు ఉన్నచోట నియోజకవర్గాల సంఖ్య పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. దానిని కచ్చితంగా అడ్వాంటేజ్ గా తీసుకుంటారు చంద్రబాబు. అందుకే ఇన్ని రోజులు ఆయన మౌనంగా ఉన్నారు.

**చంద్రబాబు విషయంలో తగ్గుతున్న ప్రతికూలత..**

తెలంగాణ సమాజంలో చంద్రబాబు పట్ల విద్వేశం రెచ్చగొట్టడంలో ప్రత్యర్థులు సక్సెస్ అయ్యారు. అయితే ఇన్ని రోజులు చంద్రబాబు పేరు చెప్పి రాజకీయం చేసిన నేతలకు తెలంగాణలో చెక్ పడింది. చంద్రబాబు విషయంలో తెలంగాణ సమాజంలో మార్పు కనిపిస్తోంది. ఆయనపై ఉన్న ప్రతికూలత తగ్గుతోంది. అందుకే ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అక్కడ కీరోల్ ప్లే చేస్తోంది. ఆ పార్టీ ఎటువైపు అంతర్గతంగా మొగ్గుచూపితే.. ఆ పార్టీ విజయం సాధించే పరిస్థితి వచ్చింది. అందుకే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి తెలంగాణలో ప్రతి రాజకీయ పార్టీ టిడిపి జపం పఠిస్తుంది. ఆ పార్టీ పోటీ చేస్తే మాత్రం వర్కౌట్ కాదు కానీ.. సైలెంట్ గా ఉండి మద్దతు తెలిపిన పార్టీ మాత్రం అధికారంలోకి రావడం ఇటీవల తెలంగాణలో కనిపిస్తోంది. అయితే తన విషయంలో తెలంగాణ సమాజం లో ఉన్న అపవాదులను చంద్రబాబు అధిగమించారు. సరిగ్గా ఈ సమయంలోనే డీ లిమిటేషన్ ప్రక్రియ ద్వారా తెలంగాణలో బలపడాలన్నది చంద్రబాబు ప్రణాళికగా తెలుస్తోంది.

**పెరిగే నియోజకవర్గాల్లో..**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఉండనుంది. ప్రస్తుతం తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పునర్విభజనతో 55 నియోజకవర్గాలు పెరగనున్నాయి. అవి కూడా గ్రేటర్ తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆంధ్ర సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో నియోజకవర్గాల పెంపు ఉంటుందన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే తెలుగుదేశం పార్టీకి అక్కడ బలం పెరిగినట్టే. ప్రస్తుతం ఆంధ్రాలో టిడిపి అధికారంలో ఉన్న నేపథ్యంలో సెటిలర్స్ విషయంలో ప్రత్యేక ప్రకటనలు చేస్తే కచ్చితంగా వారు యాక్టివ్ అవుతారు. గ్రేటర్ తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 30 నియోజకవర్గాలపై దృష్టి పెడితే టిడిపికి సునాయాస విజయం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. మరోవైపు ఖమ్మం జిల్లాలో కూడా టిడిపి బలం చెక్కుచెదర లేదు. అక్కడ కమ్మ సామాజిక వర్గం సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉంది. అందుకే ఖమ్మం జిల్లాకు చెందిన కాకలు తీరిన యోధులు సైతం టిడిపి విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేయరు. చంద్రబాబు పట్ల సానుకూలంగానే ఉంటారు. ఆ పార్టీ మద్దతు లేనిదే అక్కడ గెలవడం కష్టం. అటువంటి చోట డీ లిమిటేషన్ లో కొత్త నియోజకవర్గాలు రావడం ఖాయం. ఖమ్మం జిల్లాలోనూ కూడా అదే పరిస్థితి. అందుకే నియోజకవర్గాల పునర్విభజన అనేది చంద్రబాబుకు కలిసి వచ్చే అంశంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి చంద్రబాబు ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# తెలుగు యూనివర్సిటీ విద్యార్థుల నృత్య కళ ప్రదర్శన





## ప్రేమాక్షరి పుస్తకావిష్కరణలో అద్భుత ప్రదర్శన

## బోనాల ప్రదర్శనకు ప్రముఖుల ప్రశంసలు

## నా జీవితంలో శ్రద్ధగా చూసిన ప్రదర్శన : వీసీ నిత్యానందరావు

## కళ కూడా కమ్యూనికేషనే : సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్

## దుమ్ములేపిన లంబాడీ డ్యాన్స్

**కూకట్ పల్లి, మార్చి 29 (క్రైమ్ మిర్రర్) :** పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల మోతలు, గజ్జెల గలగలలు కలిసి బోనాల సంబురం అంబరాన్ని తాకింది. తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియం దద్దరిల్లింది. సాంబ్రాణీ పొగ, కల్లు సాకలతో బోనాల ఊరి జాతరను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలోని లలిత కళా పీఠం ఫోక్ ఆర్ట్స్ విద్యార్థులు ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం రోజు జరిగిన ప్రేమాక్షరి పుస్తకావిష్కరణ వేదిక మీదకు తీసుకొచ్చి భళా అనిపించేలా ప్రదర్శించారు. లక్ష్మమ్మ, పోచమ్మకు బోనం చేయంగా అంటూ.. విద్యార్థి దశలోనే ఆ కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆడిటోరియంలో పూనకాలు తెప్పించింది. శివసత్తులు శివాలెత్తించారు. రావే రావే పెద్దమ్మా.. నిన్ను రాజులు కొలిచిన జేజమ్మ.. మహిమలు గల రుద్రమ్మ.. మమ్ము చల్లగా చూడే ఎల్లమ్మ అంటూ వేదిక దద్దరిల్లేలా ఆడిపాడారు. కత్తులు బల్లెము చేతబట్టి దుష్టుల తలలు మాలగట్టి.. అంటూ హోరెత్తించే దప్పుల మోతకు ఆడిటోరియం ప్రాంగణాన్ని మారుమోగించారు. పూనకాలతో ఊగే అమ్మవారిని కళ్లకు సాక్షాత్కరించారు. పీఠాధిపతి డా.విజయ్‌పాల్ తీర్చిదిద్దిన విద్యార్థినీ, విద్యార్థుల ప్రదర్శన అలరించిందని ప్రముఖులెందరో ప్రశంసించారు.

**ఎంతో శ్రద్ధగా చూశా...వీసీ వెలుదండ నిత్యానందరావు**

తాను పుస్తకాలు, సాహిత్యంలో పుట్టి పెరిగానని, తన జీవితంలో అత్యంత శ్రద్ధగా చూసిన ప్రదర్శన ఇది అని జానపద విభాగం విద్యార్థుల బోనాల నృత్యాన్ని తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానందరావు కొనియాడారు. నృత్యం, గానం అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులను అభినందించారు. కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడే ఆయా ప్రదర్శనలు గొప్పవని చాటి చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ముందు తరం వాళ్లు గొప్పవాళ్లు అనుకుంటారని, తర్వాతి తరంలో శ్రద్ధాశక్తులు లేవని అంటారని, కానీ ఏ కాలానికి ఆ కాలం అనువైన వాతావరణం ఏర్పాటు చేస్తుందని నిత్యానందరావు అన్నారు. అందుకు నేటి ఈ విద్యార్థుల ప్రదర్శనే నిదర్శనం అని చెప్పారు. విద్యార్థులకు పీఠాధిపతులు చక్కని శిక్షణ ఇస్తున్నారని అభినందనలు తెలిపారు.

**కళ కూడా కమ్యూనికేషనే : సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్**

సమాజంలో కళ కూడా ప్రజలకు మంచి, చెడులు, సంస్కృతీసంప్రదాయాలు తెలిపే కమ్యూనికేషన్ సాధనమే అని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ తెలిపారు. తెలుగు వర్సిటీ జానపద విభాగం విద్యార్థుల ప్రదర్శన ఆద్యంతం అలరించిందని అభినందించారు. కొండూరి కోటిబాబు, దాసు, నాగుల అంజిబాబు (యన్. ఆంజనేయులు) తదితరుల పర్యవేక్షణలో ప్రేమాక్షరులు రచించిన ప్రేమాక్షరి పుస్తకావిష్కరణలో చివరిగా విద్యార్థులు ప్రదర్శించిన లంబాడీ డ్యాన్స్ కూడా దుమ్ము లేపింది. ఈ ప్రదర్శనను వీక్షించిన రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, సామాజిక తదితర శాస్త్రాల పీఠం డీన్ ఆచార్య బీ.హెచ్. పద్మప్రియ, ఇతర విభాగాధిపతులు, జర్నలిజం అధ్యాపకులు డా. షేక్ హసీనా, డా. షేక్ షమీర్, డా. వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు ప్రశంసించారు.



## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
## బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్ 57వ డివిజన్ నాదర్గుల్ గుర్రం గూడలోని శ్రీ శ్రీ అవెన్యూ కాలనీలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పర్యటించి, స్థానిక ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో నెలకొన్న రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, స్ట్రీట్ లైట్స్ లోపాలు, పార్క్ అభివృద్ధి వంటి పలు ముఖ్య పనులకు సంబంధించిన విషయాలను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మరియు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ గోవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ కుర్రా శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, విజయ్ రెడ్డి, విజయ్ మోహన్, నరసింహారెడ్డి, సంజీవ్, వెంకటేష్, శ్రీ రామ్, సనాథ్, రవీంద్రనాథ్, రాజేష్, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, శంకర్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా బండి సిద్ధులు

**శాలువాతో సత్కరించిన విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్**

**కూకట్ పల్లి, మార్చి 29 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ 33 బ్లాక్ శ్రీ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా బండి సిద్ధులు ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన బండి సిద్ధులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బండి సిద్ధులు మాట్లాడుతూ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్లో ఎలాంటి సమస్యలు ఉన్న త్వరితగతిన పూర్తిచేసేందుకు తన వంతు కృషి చేస్తారని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. నాపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీ ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, జితేందర్, కిషన్ రావు, శంకర్, శ్రీనివాస సాగర్, రవి చారి, ప్రసాద్, మల్లికార్జున్, నారాయణ, నాగార్జున, విజయ్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం
## 150 మంది రోగులకు వైద్య సేవలు

**ఖమ్మం ( క్రైమ్ మిర్రర్ బ్యూరో):** నేలకొండపల్లి మండలంలోని సదాశివపురం గ్రామంలో నేలకొండపల్లి భక్త రామదాసు సొసైటీ ఆధ్వర్యంలో వైరా లయన్ కంటి హాస్పటల్ వారి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. తొలుత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పాలపాటి సురేష్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో డాక్టర్ శ్యామ్, డాక్టర్ వరలక్ష్మి 150 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు చేశారు.



ఈ సందర్భంగా భక్త రామదాసు సర్వీస్ సొసైటీ చైర్మన్ పచ్చ తిరుపతయ్య మాట్లాడుతూ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రతి పేదవాడు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలపాటి సురేష్, క్యాంపు చైర్మన్ గెల్లా జగన్ మోహన్ రావు, వైస్ చైర్మన్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, కనపర్తి కోటేశ్వరరావు, సెక్రటరీ గెల్లా వెంకటరమణగుప్త, కోశాధికారి దండ రవీంద్రబాబు, మాజీ చైర్మన్లు ఏటుకూరి వెంకటరామారావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, ఎలమద్ది లెనిన్, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, వల్లంచెట్ల భాస్కరరావు, మచ్చ రఘుపతి, చావా గణపతిరావు, కొడారు వెంకటాచారి, షేక్ ఖాసిం సాహెబ్, రేలా నరసింహారెడ్డి, నంచర్ల దేవి ప్రసాద్, ఓరుగంటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.





## ఐఐటి-జేఈఈ/నీట్/ఎంసెట్, పరీక్షల అవగాహన కోసం ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్

**యాదాద్రి భువనగిరి, మార్చి 29(క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్లో హాస్టళ్ళలో ఉంటూ, గ్రామాల నుంచి హైదరాబాద్ కి, వెళ్ళి వస్తూ, నానా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని, రత్నం ఫౌండేషన్, ముందు చూపుతో మునుగోడు నియోజకవర్గ విద్యార్థులకు, చౌటుప్పల్ కేంద్రంగా వివిధ సబ్జెక్టులలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఐఐటి–జేఈఈ/నీట్/ఎంసెట్, పరీక్షలకు, 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించింది. ప్రతిరోజు ఈ శిక్షణ తరగతులు, వివిధ అధ్యాపకులచే తరగతులు నిర్వహిస్తున్నారు.కోచింగ్ కు, వచ్చిన వారికి ఉచిత మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని ఫౌండేషన్ వారు తెలియజేశారు.రత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్ ఏప్రిల్ 26, 2026, సమయం ఉదయం: 11: 00గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుంది.

రిజిస్ట్రేషన్ చివరి తేదీ: ఏప్రిల్ 10, 2026

**ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్:** మొదటి బహుమతి– 10,016/–

రెండవ బహుమతి– 5,016/– వివరాలకు: రత్నం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఊదరి మల్లేష్, 9000163356, 9133016336 సంప్రదించండి.



## హైకోర్టు అడ్వకేట్ చలకాని వెంకట్ యాదవ్ ని సన్మానించిన ప్రేమ సేవా సదనం సభ్యులు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 29:** హైకోర్టు అడ్వకేట్, హైకోర్టు మాజీ ప్రభుత్వ ప్లీడర్,సీనియర్ న్యాయవాది,పేదల పక్షపాతి, న్యాయం కోసం కొట్లాడే ప్రజల మనిషి,చలకాని వెంకట్ యాదవ్ రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన శుభ సందర్భంగా ప్రేమ సేవాసదనం స్వచ్ఛంద సేవ సంస్థ,ఆలేరు ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆదివారం కలుసుకొని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని,తన సేవా నిరతిని చాటుకుంటూ న్యాయాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రేమ సేవా సదనం ఫౌండర్,ఆలేరు మాజీ సర్పంచ్,ఆకవరం మోహన్ రావు,డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షిద్ పాషా,దూడం మధు,చెక్క పరశురాములు, తదితరులున్నారు.

## డ్యూటీ పెయిడ్ మద్యాన్ని మాత్రమే వినియోగించుకోవాలి

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ శంషాబాద్, గండిపేట పరిధిలోని ఈవెంట్ పర్మిట్ కోసం డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగించుకోవచ్చునని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్, గండిపేట్ పరిధిలోని ఫంక్షన్‌హాల్స్, ఈవెంట్ ఏరియాలు, ఫామ్‌హౌస్‌లు, గేటెడ్ కమ్యూనిటీ క్లబ్స్, మద్యం సరఫరా చేసే ప్రదేశాలలో మద్యం సరఫరా చేసేందుకు ఈవెంట్ పర్మిట్‌ను ఎక్సైజ్ డ్యూటీ ద్వార వెబ్‌సైట్‌లో సోషల్ గేథరింగ్స్‌కి జీహెచ్‌ఎంసీ ఏరియాలో 12000, జీహెచ్‌ఎంసీ ఏరియా కానీ ప్రాంతాలలో 9 వేల రూపాయలు చెల్లించి ఈవెంట్ పర్మిట్ సుంకం చెల్లించిన మద్యం వినియోగంచవలెనన్నాను. అదే విధంగా ఈవెంట్ ఏరియాలో సుంకం చెల్లించని(నాన్ డ్యూటీ పేయిడ్ లిక్కర్––ఎన్‌డిపిఎల్) లేదా ఇతర రాష్ట్రాల మద్యం అనగా గోవా, హర్యానా, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి తెచ్చిన వాటిని వాడితే కఠిన చర్యలు తీసుకోని ఫంక్షన్‌హాల్, ఫామ్‌హౌస్, ఈవెంట్ ఏరియా యజమాని, ఈవెంట్ నిర్వహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా ఎటువంటి డ్రగ్స్ లేదా సుంకం చెల్లించని(ఎన్‌డిపిఎల్) మద్యం వినియోగం గురించి సమాచారం ఉంటే సెల్‌ఫోన్ 8712658750లో సమాచారం అందించాలని కోరారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే–అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## ఎంతో కొంత కళా పోషణ ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. రెండు రోజులపాటు నిర్వహించిన శాసన సభ్యుల క్రీడా సాంస్కృతిక పోటీల ముగింపు సభ ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... చాలామంది ప్రజా ప్రతినిధులు తమలో ఉన్న ప్రతిభను మర్చిపోయారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో శాసనసభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించే వారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంప్రదాయాన్ని కొనసాగించలేదన్నారు. శాసనసభ్యుల క్రీడా పోటీలను కొందరు రాజకీయం చేసి బహిష్కరించారని, కనీసం వచ్చే సంవత్సరమైనా పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాల వైపు వెళ్తూ.. తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పలువురు శాసన సభ్యులు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. విజేతలు వీరే.. : క్రికెట్‌లో మంత్రి శ్రీహరి జట్టు విజయం సాధించగా.. బ్యాడ్మింటన్‌లో రాందాస్ నాయక్, ఆదినారాయణ జోడి విజయం సాధించింది. టేబుల్ టెన్నిస్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు గెలుపొందారు. పవర్ లిఫ్టింగ్ 63 కేజీల విభాగంలో శంకర్ నాయక్, 93 కేజీల విభాగంలో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, 105 కేజీల విభాగంలో అనిరుధ్ రెడ్డి విజయం సాధించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

శాసనసభ్యుల కోసం రవీంద్ర భారతిలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అట్టహాసంగా జరిగాయి. దుర్యోధనుడి వేషధారణలో మంత్రి వాకిటి శ్రీహరి పలికిన డైలాగులు, గంభీరమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కట్టప్ప పాత్రలో శంకర్ నాయక్ ఒదిగిపోగా, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గిరిజన పాటలకు హుషారుగా డ్యాన్స్ చేయగా.. రామచంద్రనాయక్ తనదైన స్టెప్పులు వేశారు.

## ఇంధన సంక్షోభం... ప్రజలకు బంపర్ ఆఫర్ ఇచ్చిన ఆస్ట్రేలియాలోని రెండు రాష్ట్రాలు



ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన ఇంధన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ఆస్ట్రేలియాలోని రెండు రాష్ట్రాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. విక్టోరియా, టాస్మానియా రాష్ట్రాలు తమ ప్రజలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందిస్తున్నట్టు ప్రకటించాయి. ఈ నిర్ణయంతో లక్షలాది మందికి ఊరట కలగనుంది. విక్టోరియా రాష్ట్రంలో మార్చి 31 నుంచి నెల రోజుల పాటు మెట్రోపాలిటన్, వి/లైన్ సర్వీసుల పరిధిలోని రైళ్లు, ట్రామ్‌లు, బస్సుల్లో ప్రయాణం పూర్తిగా ఉచితం. ఇంధన ఖర్చుల ఒత్తిడిని తగ్గించేందుకు ఈ తాత్కాలిక చర్య తీసుకున్నామని విక్టోరియా ముఖ్యమంత్రి జసింతా అల్లన్ తెలిపారు. "ఇది అన్ని సమస్యలను పరిష్కరించకపోయినా, ప్రజలకు తక్షణ సహాయం అందిస్తుంది" అని ఆమె వివరించారు. ఈ నిర్ణయంతో ప్రజలు నెలకు సుమారు 220 డాలర్ల వరకు ఆదా చేసుకుంటారని అంచనా. అదేవిధంగా, టాస్మానియా రాష్ట్రంలో మార్చి 30 నుంచి జూలై 1 వరకు మూడు నెలల పాటు బస్సులు, ఫెర్రీ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జెరెమీ రాక్‌లిఫ్ ప్రకటించారు. ఈ కాలంలో తమ రాష్ట్ర ప్రజలు ప్రజా రవాణాకు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ పరిణామాలతో ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడి ఆస్ట్రేలియాలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. అనేక ప్రాంతాల్లో ఇంధన కొరత ఏర్పడి వ్యవసాయం, మైనింగ్ రంగాలపై ప్రభావం పడింది.

## ఒంటిమిట్టకు 85 వేల లడ్డూలు పంపిన టీటీడీ

కడప జిల్లాలోని ఒంటిమిట్టలో ఏప్రిల్ 1న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను టీటీడీ తరలించింది. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు పంపిణీ చేసేందుకు మొత్తం 85 వేల లడ్డూలను ఆదివారం ప్రత్యేకంగా ప్యాక్ చేసి ఒంటిమిట్టకు పంపించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ ఆఫీసర్, డిప్యూటీ ఈఓ (పరకామణి) వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ప్యాకింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. దాదాపు 200 మందికి పైగా మహిళా సేవకులు, 100 మంది పురుష సేవకులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఈ లడ్డూలను ప్రత్యేక వాహనాల్లో ఒంటిమిట్టకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్టేట్స్ ఆఫీసర్ మాట్లాడుతూ.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ రవిచంద్ర, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరిల ఆదేశాల మేరకు కేవలం ఐదు గంటల్లోనే 85 వేల లడ్డూలను ప్యాక్ చేసి, ఒంటిమిట్టకు సకాలంలో చేరేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ శ్రీవారి సేవాసదన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# నీట మునిగి 8 మంది మృతి






నీట మునిగి 8 మంది మృతిచెందారు. వీరిలో ఆరుగురు ఈతకు వెళ్లి మరణించగా, మరో ఇద్దరు చెరువులో మునిగి చనిపోయారు. గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు (వరుసకు అక్కా తమ్ముడు) రిషిక (13), కుక్కల మనీష్ అలియాస్ లక్కీ (11) మామ వరుసైన గణేశ్‌తో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. గణేశ్ పశువులను మేతకు తీసుకెళ్లగా మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లే కాలువలో మనీష్ ఈత కోసం దిగాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతుండగా రిషిక కాపాడేందుకు కాలువలోకి దిగగా ఇద్దరూ మృతి చెందారు. రుషిక కొడకండ్ల ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా, మనీష్ 7వ తరగతి చదువుతున్నాడు. కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపీఎస్ అయేషా ఫాతిమా ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను బయటకు తీయించారు. ఇదిలాఉండగా హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి బాలాజినగర్‌కు చెందిన రాములు కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్, రాంచంద్రాపూర్ శివారులో కొంత వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. దీంతో రాములు కొడుకు రాజుతోపాటు 8 మంది స్నేహితులతో కలిసి సరదా కోసం వ్యవసాయ బావి వద్దకు వచ్చారు. విజయ్‌కుమార్‌తోపాటు మరో నలుగురు మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లే కాలువలో ఈత కోసం దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతోపాటు ఈత రాకపోవడంతో విజయ్‌కుమార్ నీటిలో మునిగిపోతుండగా స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు.. అయినా ఫలించలేదు. దీంతో విజయ్‌కుమార్ మృతి చెందాడు. విజయ్ కుమార్ ఆర్మీ క్యాంటీన్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడన్నారు. ఈ మేరకు మృతుల కుటుంబీకుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో విషాదం

సత్తుపల్లి టౌన్: ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న వేంసూరు మండలం కుంచపర్తికి చెందిన ఒంగూరి జానకి, వెంకటేశ్వరరావు కుమారుడు నాగబాబు (12) రేజర్ల సమీపాన మామిడి తోటలో గేదెలు మేపేందుకు వెళ్లాడు. నాగబాబుతోపాటు అదే కాలనీకి చెందిన వంటిపులి దేవ (11), షేక్ సైదులు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే నీళ్లు ఉన్న మట్టి క్వారీ గుంత వద్దకు వెళ్లి ఈత కొట్టేందుకు దూకారు. అయితే క్వారీ గుంతలో నీళ్ల లోతును అంచనా వేయలేక మునిగిపోతూ కేకలు వేశారు. సమీపంలో గేదెలు మేపుతున్న దేశినేని సుధారాణి తన చున్నీ విసిరి భుజాల వరకు నీట మునిగిన షేక్ సైదులును కాపాడింది. మిగతా ఇద్దరు నీళ్లల్లో పూర్తిగా మునిగిపోవడంతో మరణించారు.

**చెరువులో మునిగి ఇద్దరు మృతి**

కోనరావుపేట (వేములవాడ): చెరువులో మునిగి ఇద్దరు చనిపోయిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంలో విషాదం నింపింది. ధర్మారం గ్రామానికి చెందిన ముడికె లక్ష్మీరాజం (65), కుమ్మం మొండయ్య (55) అనే గొర్రె కాపరులు తమ జీవాలను తీసుకుని గ్రామ శివారులోని పెద్దచెరువు వైపు వెళ్లారు.

గొర్లను చెరువులోకి తీసుకెళ్లి స్నానం చేయించేందుకు దిగగా లక్ష్మీరాజం ప్రమాదవశాత్తు చెరువులో జారిపడ్డాడు. గమనించిన మొండయ్య అతడిని కాపాడేందుకు చెరువులోకి దిగాడు. ఈక్రమంలో లక్ష్మీరాజం.. మొండయ్య మెడను గట్టిగా పట్టుకోవడంతో ఈత వచ్చినా కూడా ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. కోనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికా స్థావరాలపై నిప్పుల వర్షం



దుబాయ్/టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధం భూతలానికి విస్తరించేలా కనిపిస్తోంది. ముఖాముఖీ పోరుకు అమెరికా, ఇరాన్ సై అంటే సై అంటున్నాయి. అమెరికా ఇప్పటికే వేలాది మంది జవాన్లను పశ్చిమాసియాకు తరలించింది. 3,500 మంది మెరైన్లు, సైనికులు ఆదివారం గల్ఫ్‌కు చేరుకున్నారు. ఇరాన్‌తో ప్రధాన భూభాగంతో పాటు ఖర్గ్ ద్వీపంపై దాడి చేసేంత దూరంలోనే మోహరించారు. పశ్చిమాసియాలో 50 వేల మందికి పైగా అమెరికా సైన్యం ఉన్నట్లు అంచనా. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఆదేశాలు రాగానే రంగంలోకి దిగేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారు. వీరికి తోడు మరో 10 వేల మంది సైనికులను త్వరలో పశ్చిమసియాకు తరలించాలని అమెరికా భావిస్తోంది. మరోవైపు ఇరాన్ కూడా వెనక్కు తగ్గడం లేదు. తమపై భూతల దాడులకు దిగితే తిరిగి వెళ్లేది శవాలేనంటూ హెచ్చరించింది. ఇరాన్ మిస్సైల్ లాంచింగ్, గగనతల రక్షణ వ్యవస్థలు, నౌకా మార్గాలను దెబ్బకొట్టి వెన్ను విరవాలని అమెరికా భావిస్తోంది. ఇరాన్‌కు ఆర్థికంగా ఆయువుపట్టైన ఖర్గ్ దీవిని దిగ్బంధిస్తే విధి లేక చర్చలకు దిగొస్తుందని అమెరికా అంచనా వేస్తోంది. ట్రంప్ బెదిరింపులతో సరిపెట్టబోరని, తీవ్ర చర్యలకు సిద్ధంగా ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు. ఒప్పందానికి ముందుకు రాకపోతే ఇరాన్ పరిస్థితి నరకప్రాయం అవుతుందని హెచ్చరించారు.

దుబాయ్‌లో రెండు స్థావరాలపై దాడులు

పశ్చిమాసియా యుద్ధం 30 రోజులకు చేరింది. దాడులు, ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా 3 వేల మందికిపైగా మరణించారు. ఆదివారమూ పరస్పర దాడులు కొనసాగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగింది. పేలుళ్లతో నగరం దద్దరిల్లింది. దాడుల్లో అల్ అరబీ టీవీ చానల్ కార్యాలయం ధ్వంసమైంది. ప్రసారాలు ఆగిపోయాయి. ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ సైన్యం క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్‌పై కూడా దాడులు కొనసాగించింది. క్షిపణులను మధ్యలోనే అడ్డుకున్నట్లు ఆ దేశాలు ప్రకటించాయి. యెమెన్ హూతీలు ఇరాన్, లెబనాన్ హెజ్బొల్లాతో కలిసి ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడ్డారు. జోర్డాన్‌లో అమెరికా ఎయిర్‌బేస్‌తోపాటు ఇజ్రాయెల్ కెమికల్ ఫ్యాక్టరీపై దాడి చేసినట్లు ఇరాన్ వెల్లడించింది. దుబాయ్‌లోని రెండు అమెరికా సైనిక స్థావరాలపైనా అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులకు పాల్పడింది. ఒక స్థావరంలో 400 మంది, మరోదాంట్లో 100 మంది జవాన్లున్నారు. వారిలో చాలామంది దాడిలకు బలైనట్టు ఇరాన్ సైన్యం చెబుతోంది. మృతదేహాలను, క్షతగాత్రులను చేరవేస్తూ అంబులెన్స్‌లు బిజీగా తిరగాయని పేర్కొంది.

**అమెరికాకు తీవ్ర నష్టం**

ఇరాన్ దాడుల్లో అమెరికాకు అనూహ్య నష్టం జరిగింది. సౌదీ అరేబియాలో ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై క్షిపణులు, డ్రోన్ల దాడిలో అమెరికాకు చెందిన అత్యాధునిక అవాక్స్ నిఘా విమానంతో పాటు పలు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసమయ్యాయి. అవాక్స్ విమానాన్ని అమెరికా సైన్యానికి అతిపెద్ద ఆస్తిగా పరిగణిస్తారు. దాడిలో అది పనికిరాకుండా పోయింది. అమెరికాకు ఎంక్యూ--9 డ్రోన్లతో పాటు ఎఫ్--16 యుద్ధ విమానం కూడా ధ్వంసమైనట్టు సమాచారం. ఇజ్రాయెల్ వర్సిటీలు, గల్ఫ్‌లోని అమెరికా వర్సిటీల శాఖలపైనా దాడులు చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. నిరాయుధీకరణ ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి తప్పుకోవాలని ఇరాన్ నిర్ణయించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టింది. అణు శక్తి విషయంలో కొత్తగా అంతర్జాతీయ ఒప్పందం తేవాలని ఇరాన్ కోరుతోంది. పశ్చిమాసియాలో శాంతి సాధనే ధ్యేయంగా పాకిస్తాన్‌లో ఆదివారం కీలక సమావేశం జరిగింది. సౌదీ అరేబియా, ఈజిప్ట్, తుర్కియే, పాకిస్తాన్ విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. తాజా పరిస్థితులపై చర్చించారు.

తమ భూతలంలోకి అమెరికా సేనల రాక కోసం ఎదురు చూస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఖలిబాఫ్ ప్రకటించారు. "అమెరికా, దాని మిత్రదేశాల సైన్యాన్ని మసి చేస్తాం. ఆ దేశాలను శాశ్వతంగా శిక్షిస్తాం" అని హెచ్చరించారు. ఇరాన్ లొంగిపోవాలని అమెరికన్లు కోరుకుంటున్నంత కాలం యుద్ధం కొనసాగుతుందన్నారు.



**కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆత్మీయ విందు, ఘనసత్కారం..**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ తమ నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు ఆత్మీయ విందు ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి నిరంతరం సేవలందిస్తున్న సీనియర్లను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ విందుకు హాజరైన ప్రతి కార్యకర్త వద్దకు వెళ్లి వారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారి సేవలను ఆయన కొనియాడారు. తమను కుటుంబ సభ్యులుగా భావించి, స్వయంగా ఇంటికి ఆహ్వానించి విందు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. అధినేత చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, విందుకు హాజరైన కార్యకర్తలందరినీ చంద్రబాబు, లోకేశ్ కొత్త బట్టలు పెట్టి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది

## ఆ బాధ్యతను లోకేశ్ కు అప్పగిస్తున్నా: సీఎం చంద్రబాబు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని, వారిని నిర్లక్ష్యం చేసే నాయకులను తాను ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే నాయకులు మాకు అవసరం లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయిన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈసారి వినూత్నంగా వేదికపై కార్యకర్తలను కూర్చోబెట్టి, సీనియర్ నేతలు సభికుల్లో కూర్చోవడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే నినాదానికి ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చారు. భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. "రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని బలోపేతం చేయండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను, నేతలను గుర్తించే కీలక బాధ్యతను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు అప్పగిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలోనూ పార్టీ బ్రాండ్‌ను నిలిపేలా ఆదర్శంగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ ప్రస్థానాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. "టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి అడుగూ సంచలనమే, ప్రతి నిర్ణయమూ ప్రజాక్షేమమే.

# ఘనంగా ఊరూరా సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు

## గుల్లపల్లి వెంకటేష్ గౌడ్.. ఏప్రిల్ 2న విప్లవ వీరుడికి నివాళులు మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుల పిలుపు





క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 29: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఏప్రిల్ 2వ తేదీన జిల్లావ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ)జిల్లా అధ్యక్షులు గుల్లపల్లి వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ వీరోచిత చరిత్రను, ఆయన చేసిన పోరాటాలను నేటి తరానికి చాటిచెప్పాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్య క్రూర పాలనకు, జమీందార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన మహానుభావుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. 1650లో ఖిలాషాపూర్ గ్రామంలో సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన ఆయన,అణగారిన వర్గాలను ఏకం చేసి మొఘల్ సైన్యాన్ని గడగడలాడించారని గుర్తు చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలతో సైన్యాన్ని ఏర్పాటు చేసి,గెరిల్లా యుద్ధం ద్వారా మొఘలులకు ప్రధాన శత్రువుగా మారారు. ఖిలాషాపూర్,తాడికొండ, భువనగిరి వంటి చోట్ల కోటలు నిర్మించి సార్వభౌమాధికారాన్ని చాటారు. 1708లో వరంగల్ కోటను ఆక్రమించి విజయ పతాకం ఎగురవేశారు. ఆలయాల ధ్వంసాన్ని అడ్డుకుంటూ,మహిళల గౌరవాన్ని కాపాడుతూ 'అపర శివాజీ'గా, 'హిందూ ధర్మ పరిరక్షకుడు'గా ప్రజల హృదయాల్లో నిలిచారు. తెలంగాణ ప్రభుత్వం పాపన్న గౌడ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఏప్రిల్ 2న ప్రతి గ్రామంలో గౌడ కుల బాంధవులు, బహుజనులు ఐక్యంగా పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని వెంకటేష్ గౌడ్ కోరారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన బాటలో నడవడమే పాపన్న గౌడ్ కు మనం ఇచ్చే నిజమైన గౌరవమని ఆయన అన్నారు.

## భువనగిరి బాలుడిపై వీధి కుక్కల దాడి ఘటనపై హెచ్ఆర్సీ లో కేసు నమోదు


### 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ న్యాయవాది వినోద్ హిందుస్తానీ ఫిర్యాదు



క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 29: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి చూపు కోల్పోయిన బాలుడికి 50 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని కోరుతూ హై కోర్టు న్యాయవాది వినోద్ హిందూస్థానీ రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హెచ్ఆర్సీ శనివారం నాడు కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది వినోద్ హిందూస్థానీ మాట్లాడుతూ పసివాడు శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారని, మునిసిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని మండిపడ్డారు.విధి నిర్వహణలో విఫలమైన భువనగిరి మున్సిపల్ అధికారులపై తక్షణమే శాఖాపరమైన,క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్నారికి అవసరమైన అత్యుత్తమ వైద్యాన్ని పూర్తి ఉచితంగా ప్రభుత్వ ఖర్చుతోనే అందించాలని హెచ్ఆర్సీకి సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

## ఉల్లాస్-నవ భారత సాక్షరతా కార్యక్రమా మూల్యాంకన పరీక్ష

క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 29: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యావకాశం పొందని15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయబడు కార్యక్రమంలో భాగంగా వయోజనులు వారు నేర్చుకున్న చదువు మీద మూల్యాంకన పరీక్ష వ్రాసిన వయోజనులు. ఈ కార్యక్రమంలో ఏక్కువగా మహిళలే పాల్గొన్నారు.మూల్యాంకనం అనంతరం వారు మాట్లాడుతూ ఈ పరీక్ష విదానం వలన మాకు చదువు విలువ తెలిసింది అని మహిళా సంఘం సభ్యులు తెలిపారు. మహిళా సంఘం అధ్యక్షురాలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.





## ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం




గండిపేట(క్రైం మిర్రర్): ప్రమాదవశాత్తు ఓ అపార్ట్‌మెం ట్‌లో మంటలు చెలరేగిన సంఘటన మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో చోటు చేసుకుంది. అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 25లోని గ్రేటర్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ థర్డ్ ఫ్లోర్‌లో మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండడంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. రెండు అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ వేడుకలు



ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్లు పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను నేలకొండపల్లి ఉప సర్పంచ్ మద్దినేని మహేష్ ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేస్తూ పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నేలకొండపల్లి పట్టణ కమిటీ అధ్యక్షులు అక్కినేని నాగేశ్వరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయిన క్రమంలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించారన్నారు. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. వారి ఆశయ సాధనకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి మీసం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొర్లకుంట కిరణ్, కోశాధికారి రవీందర్, పావులూరి వెంకటేశ్వరరావు, తలసీల రాధాకృష్ణ, నూతక్కి ప్రసాద్, రేలా నరసింహారెడ్డి, కొణిదల సుగుణ, కోనేరు కిషోర్, చవడం ప్రవీణు, కొమరబత్తిని వెంకటేశ్వర్లు, కిరణ్, పావులూరి రమేష్, వెలగపూడి మురళి, రామకృష్ణ, రమేష్, పోలినేని రామారావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రతకు ముందే చర్యలు తీసుకోండి

### సింగరేణి యాజమాన్యానికి సీఐటీయూ డిమాండ్





మందమర్రి మార్చి 29 (క్రైమ్ మిర్రర్): ఎండలు ముదురుతున్న నేపథ్యంలో బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ముందస్తు వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. కార్మికులకు కాలానుగుణంగా ఇచ్చే గరం కోట్లు, వాన కోట్లు ఆలస్యంగా కాకుండా సమయానికి అందించడంతో పాటు, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఓపెన్‌కాస్ట్ గనుల్లో మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్నట్లే భూగర్భ గనులు, సీహెచ్‌పీలు, వర్క్‌షాప్, సివిల్ విభాగాల్లో ఎండలో పనిచేసే కార్మికులకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా వివక్ష లేకుండా ఈ సదుపాయాలు కల్పించాలని తెలిపారు.గనుల పరిసరాల్లో దుమ్ము నివారణ కోసం స్ప్రింకర్లతో నీటి పిచికారీ నిర్వహించాలని, గనులకు వెళ్లే రహదారులపై తరచుగా వాటర్ స్ప్రేయింగ్ చేయాలని కోరారు. కార్మిక కాలనీల్లో తాగునీటి సరఫరాను పెంచాలని సూచించారు.గెలిచిన గుర్తింపు సంఘాల నాయకులు సేఫ్టీ, మైన్స్ కమిటీల్లో సమర్థంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మికులకు అందాల్సిన సదుపాయాల విషయంలో యాజమాన్యాన్ని ఒప్పించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు.ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని, నాణ్యమైన బిట్లు, డ్రిల్ రాడ్లు, గ్లౌజులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్, జడల ప్రవీణ్, చీకటి వంశీ, కుమారస్వామి పాల్గొన్నారు.

## కత్తితో దాడి యువకుడు మృతి



గండిపేట(క్రైం మిర్రర్): భోజనం విషయంలో వంటవాడికి, డ్రైవర్‌కు జరిగిన గొడవలో కత్తితో దాడి చేసి హత్య చేసిన సంఘటన నార్సింగి పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోకాపేటలోని నార్త్? స్టార్ అల్లూరా విల్లాస్లో కట్రగుంట ధర్మతేజకు విల్లా నెంబర్ 24 ఉంది. ఇందులో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డకు చెందిన షేక్‌బాషా(43) వంటవాడిగా పని చేస్తున్నాడు. సుమారు 15 రోజుల క్రితం పీనుమల్ల కార్తీక్ డ్రైవర్‌గా చేరాడు. శనివారం రాత్రి షేక్ బాషా, కార్తీక్‌ల మధ్య భోజనం విషయంలో గోడవ జరిగింది. ఆ వాగ్వాదం తీవ్రమై షేక్ బాషా ఒక కత్తితో కార్తీక్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో కార్తీక్‌కు శరీరమంతా తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595



## అన్ని వర్గాల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షులు సూరెడ్డి వినయ్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీఠ వేస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షులు సూరెడ్డి వినయ్‌రెడ్డి సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని దుర్గానగర్‌లోని బొమ్మరాజు నర్సింహ్మా నివాసంలో ఆదివారం వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ప్రధానమంత్రి ప్రసంగాన్ని శ్రద్ధగా విని, ఆయన సూచించిన అంశాలపై చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన ప్రసంగంలో దేశ అభివద్ధి, యువత పాత్ర, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్, మహిళా సాధికారత, స్టార్ట్ ఆప్స్ ప్రొత్సాహం, పర్యావరణ పరిరక్షన వంటి కీలక అంశాలపై ప్రస్తావించారు. ఈ సంరద్భంగా సూరెడ్డి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆలోచనలు ప్రితి ఇంటికి చేరేలా కార్యకర్తలు కషి చేయాలని, సమాజ అభివద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం నాయకులు, కార్యకర్తలు దుర్గానగర్ బస్తీలో పర్యటన నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకోని పరిష్కారానికి కషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడికే రాజు, బల్లా శ్రీనివాస్‌యాదవ్, అడికే మహేందర్, గుదూరి అంజి, దీకొండ వేణు, వల్లూరి నిఖిల్, వల్లూరి బాబూజీ, కొండాల, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బృందావన్ కాలనీలో ప్రధాని మన్‌కీబాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో డివిజన్ అధ్యక్షులు గోదా పాండుయాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్త సతీష్ సంగ్మే నివాసంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 132వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బూత్ నెంబర్ 379లో వీక్షించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ప్రజలంతా ఎంతో శ్రద్ధతో వీక్షిస్తున్నారన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం ఆయన మాట్లాడే తీరు అందరి మనన్నలు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్ గౌడ్, వెంకటరమణగుప్తా, మజార్ బబ్లూ, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, దయానంద్, సాయి, విజయ్‌కుమార్, శివ, విజయ్, ఎన్ను శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామరావు, కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్ల పక్కన ఉన్న మట్టి కుప్పలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలు రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను పోయకూడదని మణికొండ డివిజన్‌లోని యాంబియన్స్ కోర్ట్ యార్డ్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు కోరారు. గత కొన్ని రోజులుగా కాలనీలో పేరుకుపోయిన ఘన వ్యర్థాలు ఉండడం వల్ల రోడ్డు మీద వెళ్లే వారికి ఇబ్బంది కలుగుతుండడంతో నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తో కలిసి కాలనీ వాసులు అభ్యర్థన చేశారు. దీంతో ఆదివారం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కాలనీలో పేరుకుపోయిన మట్టి వ్యర్థాలను తొలగించారు. జేసీబీ, టిప్పర్‌ల సహాయంతో పేరుకుపోయిన వ్యర్థాలను తీసి వేసి మరోసారి ఈ ప్రాంతంలో మట్టి, చెత్త వ్యర్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రవణ్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులు పెన్ డౌన్ .. కెమెరా డౌన్ కు సిద్ధం

- ఇండ్ల స్థలాలు... జర్నలిస్టుల హక్కు
- సాధన కోసం ఎటువంటి పోరాటానికైనా టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం
- -అవసరమైతే పెన్ డ కెమెరా డౌన్ కూడా చేపడతాం..
- -అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం
- మోసపూరిత చర్యలను సహించేది లేదు
- జర్నలిస్టు రాంబాబు ఇండ్ల స్థలాల దీక్ష విరమణ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి

**-హక్కుల కోసం పోరాడితే అపనిందలు మోపారు : రాంబాబు**

**క్రైమ్ మిర్రర్ ఖమ్మంప్రతినిధి:** ఇండ్ల స్థలాలు జర్నలిస్టుల హక్కు.. వాటి సాధన కోసం ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ ) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అవసరమైతే పెన్ డ కెమెరా డౌన్ లు కూడా చేపడతామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం 14 రోజులుగా స్థానిక ప్రెస్ క్లబ్ లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబుకు ఆదివారం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం సంఘటితంగా పోరాడుదామని ఖదీర్, శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందులను సైతం పక్కకు పెట్టి జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం రాంబాబు దీక్ష తలపెట్టడం అభినందనీయమని, జర్నలిస్టుల పక్షాన ముందుకు వచ్చి దీక్షకు కూర్చున్న తనకు తొలుత అండగా నిలుస్తామన్న సంఘాలు ఆ తర్వాత ముఖం చాటేయడం... వారి మోసపూరిత వైఖరికి నిదర్శనం అని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా పలుమార్లు ఇండ్ల స్థలాలు పొందిన వారు... నిబంధనల ప్రకారం ఇప్పుడు మళ్లీ ఇండ్ల స్థలాలు రావని, రానీయరని తమ పదవులు, ప్రాపకం కోసం జర్నలిస్టులను పక్కదోవ పట్టించే చర్యలను టీడబ్ల్యూజేఎఫ్ ఖండిస్తోందన్నారు. జర్నలిస్టుల ప్రయోజనాల కోసం సంఘాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతు కూడగడతామని, ఇండ్ల స్థలాలు సాధించేందుకు దశల వారీ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా అర్హులైన వర్కింగ్




జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకూ ఉద్యమాలు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటిస్తున్నట్లుగా న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాను నమ్మిన ఓ యూనియన్, మరో యూనియన్ తో కుమ్మక్కై తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం పట్ల మనోవేదనకు గురైనట్లు రాంబాబు పేర్కొన్నారు. తనను దీక్ష చేపట్టమని చెప్పిన జర్నలిస్ట్ సంఘాల నేతలు ఆ తర్వాత తాను చేస్తున్న దీక్షపై నిందలు వేసే విధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ నిర్మాణాత్మక సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్ నికరమైన ఉద్యమాలు చేస్తోంది కాబట్టే తాను ఈ సంఘం తో కలిసి నడవాలని నిర్ణయించు కున్నట్లు తెలిపారు. అందుకే తాను ఇప్పటివరకు పని చేసిన టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్)కు,ఆ యూనియన్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని రాంబాబు ప్రకటించారు. తనకు ఆహ్వానం పలికి అక్కున చేర్చుకున్న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుబాటి మాధవరావు,జిల్లా కమిటీ సభ్యులు కూరాకుల గోపీ,ఎస్ కే జానీపాష, నలుబోల మధుశ్రీ,

టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, కెమెరామన్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఫయాజ్,భూక్యా గణేష్,అర్షద్,యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా వై. నరేందర్ రెడ్డి ఎన్నిక....

### ఘనంగా సన్మానించిన రంగారెడ్డి జర్నలిస్టులు

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా వై. నరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ ) 11వ ప్లీనరీ సమావేశాలు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రియ కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం నాడు నూతన జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ప్లీనరీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు, కేంద్ర మంత్రి పేమ్మసాని చంద్రశేఖర్,రాష్ట్ర మంత్రులు పార్ధ సారథి, నిమ్మల రామకృష్ణ , టీడీపీ పార్లమెంటరీ నేత శ్రీకృష్ణ దేవరాయులు, ఎంపీ అప్పల నాయుడు,మాజీ కేంద్ర మంత్రి ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎమ్మెల్యేలు, రెండు తెలుగు రాష్ట్రాల మీడియా అకాడమీ చైర్మన్లు కే శ్రీనివాస్ రెడ్డి, ఆలపాటి సురేష్, మాజీ జాతీయ అధ్యక్షులు దేవులపల్లి అమర్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణ, 25 రాష్ట్రాల నుండి ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.ఈ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ నేత వై. నరేందర్ రెడ్డి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ఈ పదవి లభించడంతో తెలంగాణ ముఖ్యంగా రంగారెడ్డి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. మొయినాబాద్ మండలం కనక మామిడి గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి గత అనేక దశబ్దాలుగా వివిధ ప్రముఖ దినపత్రికలలో పనిచేసి ప్రస్తుతం ముద్ర పత్రిక ఎడిటర్ గా పనిచేస్తున్నారు. అదేవిదంగా యూనియన్ లో అనేక



సంవత్సరాలనుండి వివిధ పదవులు నిర్వహించి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడ పనిచేశారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బాల్ రాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివ కుమార్ , నాగేంద్ర చారి తదితరులు నరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.నరేందర్ రెడ్డి ఎన్నికతో తెలంగాణ జర్నలిస్టుల ప్రతిష్ట మరింత పెరిగిందని వారు అభిప్రాయపడ్డారు.రంగారెడ్డి చరిత్రలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ లో కీలక బాధ్యత చేపట్టబోతున్న నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిదంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు బల్విందర్ సింగ్ జమ్మూ, సోమ సుందర్ లకు, ఈసి సభ్యులగా ఎన్నికైన సత్యనారాయణ, శేఖర్, అజిత, శ్రీనివాస్ లకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

## ఉల్లాస్-అమ్మకు అక్షరమాల కార్యక్రమం

క్రైమ్ మిర్రర్ పెగడపల్లి: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం వెంగలాయిపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం మహిళా సంఘ సభ్యులు మహిళలకు అక్షరాస్యత పరీక్ష నిర్వహిం చారు.ప్రతి మహిళ అక్షరాస్యత సాధించడం, సమాజ అభివృద్ధికి కీలకమని, విద్యతో ముందడుగు వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోకెనపల్లి గోపాల్, మాజీ ఎంపీటీసీ కడారి సుప్రియ తిరుపతి, సిఏ రజిత, విఏ లత పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.





## సీయోను ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం వేడుకలు

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

### మట్టలతో ఊరేగింపుగా 'హోసన్నా' నినాదాలు

**రామకృష్ణాపూర్ మార్చి 29 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీయోను ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. చర్చ్ సెక్రటరీ దేవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు భారీగా తరలివచ్చారు.ఉదయం నుంచే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రవి రఘుయేలు దైవ సందేశాన్ని అందిస్తూ యేసుక్రీస్తు వినయం, త్యాగం, యెరూషలేములో ప్రవేశించిన సందర్భానికి సంబంధించిన మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు.ప్రార్థనల అనంతరం సంఘ సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్యాతనపల్లి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ...

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది





**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి వనపర్తి జిల్లా:** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో భక్త మార్కండేయ ఆలయం దగ్గర ఉన్న కాలనీలో గత కొన్ని రోజులుగా మున్సిపల్ కార్మికులు రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త చెదారం డ్రైనేజీలో పేరుకుపోయింది. దీంతో కాలనీలోని యువకులు మహిళలు పరిసర ప్రాంతాలలో ఉన్న డ్రైనేజీ చెత్త ప్లాస్టిక్ కవర్లను స్వయంగా శుభ్రం చేసి తమ నిరసన తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు సంప్రదించిన పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారు కోరారు.

# ఘనంగా ప్రజానాట్యమండలి 12వ జిల్లా మహాసభలు..

- నూతన జిల్లా కార్యదర్శిగా వేముల సదానందం ఎన్నిక
- మహాసభల ప్రారంభ సూచికగా ప్రజానాట్యమండలి జెండా పరిష్కరించిన కొండ్రు జానకిరామయ్య
- కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలి..
- ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకం అంజన్న
- వృద్ధ కళాకారులకు ప్రభుత్వం నాలుగు వేల పెన్షన్ ఇవ్వాలి
- ప్రజానాట్యమండలి పూర్వ అధ్యక్షుడు దేవేంద్ర





**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఖమ్మం ఎన్ఎస్పి క్యాంప్ మంచి కంటి ఫంక్షన్ హాల్ నందు ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా 12వ మహాసభ ఘనంగా ప్రారంభమయ్యాయి జిల్లా వ్యాప్తంగా 270 మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొనగా మహాసభ ప్రారంభ సూచకంగా ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా పూర్వ అధ్యక్షులు కొండ్రు జానకిరామయ్య ప్రజానాట్యమండలి పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం గత మహాసభ నుండి ఈ మహా సభ వరకు అమరులైన అమర కళాకారుల చిత్రపటాలకు పూలు సమర్పించి పాటలతో నీరాజనాలు అర్పించారు అనంతరం ప్రజానాట్యమండలి మహాసభ సంతాప తీర్మానాన్ని నందిగామ కృష్ణ ప్రవేశపెట్టగా అధ్యక్ష వర్గంగా ఏఎస్ కుమార్ నామ లక్ష్మీనారాయణ మోటమర్రి జగన్మోహన్రావులు ఉన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకం ఆంజనేయులు, ప్రజానాట్యమనుల్ని పూర్వ అధ్యక్షులు దేవేంద్రలు హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల వెలుగు పతాక ప్రజానాట్య మండలి అని ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పాలకపక్షాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తెలుగు నాట ప్రజానాట్యమండలి తన కర్తవ్యాన్ని నిరంతరం కొనసాగిస్తుందని భవిష్యత్తులో కొనసాగిస్తుందని తెలంగాణ రాష్ట్రంలో జానపద వృత్తి కలల్ని వారి జీవనంగా మలుచుకున్న కళాకారులు వేల సంఖ్యలో ఉన్నారని ఇటువంటి జానపద వృత్తి పేద కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని ప్రభుత్వ పథకాల ప్రచారంలో కూడా ఈ జానపద వృత్తి కళాకారులను ఉపయోగించుకోవాలని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని వృద్దులుగా కళారంగానికి జీవితం అర్పించినటువంటి వృద్ధ కళాకారులకు మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్లు 4వేల రూపాయలతో కళాకారులకు అందించాలని అదేవిధంగా ప్రజానాట్యమండలి కళాకారులు జానపద వృత్తి కళాకారులు వివిధ ప్రజా సంస్కృతిక ప్రయోజనాల కోసం కళా ప్రదర్శనల కోసం వారి ప్రయాణాలలో కళాకారులకు రాయితీతో కూడిన చార్జీలు ఇవ్వాలని దారిద్రరేఖ కొద్దిగా ఉన్న పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో జానపద వృత్తి కళాకారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు అనంతరం కళాకారుల సమస్యలతో కూడిన డిమాండ్లతో ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్ నుండి పాత బస్టాండ్ మీదగా భక్త రామదాసు కళాక్షేత్రం వరకు కళాకారులు కళా ప్రదర్శనలతో ప్రదర్శన నిర్వహించారు.

**ప్రభుత్వాలు కళాకారులను ఆదుకోవాలి : రైతు సంఘం నేత నున్న నాగేశ్వరరావు**

ప్రజానాట్యమండలి మహాసభలో సందేశం ఇస్తూ ప్రజల వైపున నికరంగా పోరాటం చేస్తూ ప్రజల వైపు నిలబడుతూ ప్రజా కళాకారులకు నిలయంగా నిలుస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు అభినందనీయులు అన్నారు గతం నుండి నేటి వరకు అనేక ప్రజా పోరాటాల్లో అనేక ప్రజా వ్యతిరేక విధానాల పైన వీధి నాటకాలు పాటలు ఇతర జానపద కళా రీతులలో ప్రజల పక్షాన ప్రచారం చేస్తున్నారని భవిష్యత్తులో కూడా ఈ ఒరవడిని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు జానపద కళలను పరిరక్షించుకుంటూ జానపద కళాకారులను కాపాడుకుంటున్న కళాకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని వారికి అవసరమైన వాయిద్య పరికరాలు వారి జీవన భృతికి అవసరమైన తోడ్పాటును ప్రభుత్వమే అందించాలని ఆయన కోరారు. మహాసభలో సౌహార్ధ సందేశాలు అందజేసిన ప్రజానాట్యమండలి పూర్వ నాయకులు రౌతు రవి, జిఎస్సార్ ఆంజనేయులు, కన్నెగంటి, లెనిన్ శ్రీనివాస్, బోడపట్ల సుదర్శన్, సూర్యనారాయణ, జాబిశెట్టి పాపారావు, మణుగూరు చారి, సౌహార్ధ సందేశాలు అందించి మహాసభను ఉత్సాహపరిచారు మహాసభలో పాటలు ప్రజా సమస్యలపై భవిష్యత్తులో రూపొందించాల్సిన కళారూపాలు, కళాకారుల సమస్యలపై పోరాటాలు రూపకల్పన చేసుకున్నారు అనంతరం మహాసభను ఉద్దేశించి ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పుల వెంకన్న రాబోయే కాలంలో ప్రజానాట్యమండలి ఉద్యమ నిర్మాణానికి అవసరమైన దేశాన్ని నిర్దేశం చేస్తూ మహాసభను ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు నందిగామ కృష్ణ మారుతి కొండలరావు నోముల పుల్లయ్య నరేందర్ చరణ్ సత్యం ఉపేందర్ లక్ష్మణ చారి,గోపాలరావు చింత శ్రీను నందిగామ నాగరాజు వెంకటేష్ సుమతి వెంకటలక్ష్మి సువార్త పుణ్యావతి వీరబాబు కోటి గాది వెంకటేశ్వర్లు నవీన్ పుష్పమ్మ శైలు ఉప్పమ్మ కుమారి బీమ్ల టిడిపి రామయ్య తదితర నాయకులు డప్పు కోలాటం భజన పౌరాణిక బృందాలు ఈ మహాసభలో ప్రదర్శనలో పాల్గొన్నారు



## రైస్ మిల్లు వరి పొట్టులో కూరుకుపోయి మహిళా కూలి మృతి

**బాధితురాలికి న్యాయం చేయాలని ఆందోళన**



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలోని శ్రీ అరుణాచల ఫార్ బాయిల్డ్ రైస్ మిల్లులో పనిచేస్తున్న మహిళా కూలి పప్పుల కళ్యాణి (29) ప్రమాదవశాత్తు వరి పొట్టులో కూరుకుపోయి చనిపోయిన ఘటన జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన పప్పుల కళ్యాణి, కొండలు దంపతులు కూలినాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా కళ్యాణి రాజేశ్వరపురం సమీపంలోని శ్రీ అరుణాచల ఫార్మాయిల్డ్ రైస్ మిల్లులో వరిపొట్టు వద్ద పని చేస్తుంది. రోజులాగే వరిపొట్టును తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా వరిపొట్టు తనపై పడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. విషయాన్ని గమనించిన తోటి పనివారు యాజమాన్యం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మరణించినట్లుగా నిర్ధారించారు. జరిగిన ఘటన తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు నేలకొండపల్లి ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్లో ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కళ్యాణి మృతి చెందిందని తక్షణమే ఆమెకు 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేసి చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి వార్డుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**తెలుగు ప్రజల ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ ప్రజల గుండెల్లో ఉంటుంది.**

**సర్పంచ్ వడ్డే విశాల విజయ్**

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** నేలకొండపల్లి మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసుకొని పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరెగూడెం సర్పంచ్ వడ్డే విశాల విజయ్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు జరుగుతున్న అన్యాయంతోనే నాడు అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించి అతి తక్కువ సమయంలోనే అధికారంలోకి తీసుకువచ్చి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాజ్యాధికారంలో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసి తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరుగులేని రాజకీయ శక్తిగా మారిందన్నారు. టిడిపి తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలో రానున్న రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. కార్యకర్తలతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొన్నది అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు వడ్డే విజయ్ వడ్డే రామారావు చిగురుపాటి మురళి వడ్డే యుగంధర్ పరుచూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కుల గణనలో బీసీలను కూడా లెక్కించాలి

**ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కుటుంబాల లెక్కింపులో ఓబీసీ కాలమ్ చేర్చాలి**

**బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు శ్యామ్ కుర్మ**



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 29:** ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే జాతీయ జనగణనలో బీసీ కుటుంబాలను కూడా లెక్కించాలని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు శ్యామ్ కుర్మ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని దశాబ్దాలుగా బీసీ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగానే ఈసారి సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం మొదటి దశలో జరిగే కుటుంబాల లెక్కింపులో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను లెక్కిస్తూనే బీసీ కుటుంబాలను ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీసీ కుటుంబాలను కూడా లెక్కిస్తేనే భవిష్యత్తులో బీసీల సమగ్ర కులగణనకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కుక్కలు, బర్రెలు వంటి జంతువులను కూడా లెక్కించే ప్రభుత్వం బీసీలను మాత్రం లెక్కించకపోవడం సరైంది కాదని విమర్శించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే కుటుంబాల లెక్కింపులో ఉన్న 33 కాలమ్స్‌కు తోడు 34వ కాలంగా ఓబీసీ కుటుంబాల వివరాలను నమోదు చేసే అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, మందల విజయ్‌కుమార్, ఆదె యాదగిరి, నల్ల రమేష్, నల్ల సాయి, గణం శివ, కుందే మహేష్, బర్ల సురేష్ కుమార్, సందీప్, కుంద శివకుమార్, నరేష్, శ్రీకాంత్, సాయి, సంతోష్, నర్రి నరేష్, గణం సతీష్, గణం సాయి తదితరులు పాల్గొన్నారు.


## మూసీ విషపు నీరు బదులుగా గోదావరి జలాలను అందించాలి


**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**



**భూదాన్ పోచంపల్లి, మార్చి 29(క్రైమ్ మిర్రర్):** మూసీ విషపు జలాల నుండి పోచంపల్లి ప్రాంత ప్రజలను, రైతులను విముక్తి కల్పించడానికి కొండపోచమ్మ ప్రాజెక్టు నుండి శామీర్ పేట చెరువులోకి గోదావరి జలాలు తెచ్చి షామీర్ పేట చెరువు నింపి ఆచెరువు నుండి ఘట్కేసర్ మండలం ఏదులబాద్ చెరువు ద్వారా మూసీ కావలోకి గోదావరి జలాలు మళ్లించి పోచంపల్లి ప్రాంతంలోని రైతాంగానికి సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. పోచంపల్లి పట్టణ పరిధిలోని నారాయణగిరిలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ పోచంపల్లి ప్రాంతం మూసీ విషపు జలాలతో భూములు మొత్తం ధ్వంసంమై ఎలాంటి పంటలు పండకుండ ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని ఆవేదన వెలిబుచ్చారు. పాలకులు అధికారం కోసం వాగ్దానాలు చేయడం గెలిచిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం పరిపాటిగా మారిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు తర్వాత కూడా మూసీ జల కాలుష్యాన్ని అరికట్టి యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగానికి, ప్రజలకు విముక్తి కలిగిస్తానని చెప్పారని అన్నారు. కానీ మాట మార్చి శుద్ధికరణ కాదు మూసీని అది కూడా హైదరాబాద్ ప్రాంతాన్ని మాత్రమే సుందరీ కరణ చేస్తానని చెప్పడం ఎట్లా కరెక్ట్ అని ప్రశ్నించారు. అందం హైదరాబాదుకు మురికి యాదాద్రి జిల్లాకా అని ప్రశ్నించారు. ఇప్పటికే మురికి నీళ్లతో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఒక మనుషులే కాదు పాడి ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు, మత్స్య సంపద కూడా విషయంగా మారుతున్న పరిస్థితి ఉన్నదని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు కొత్త కొత్త రకాలైన జబ్బులతో ప్రాణాలను కూడా పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతం ప్రజల ఆరోగ్యం, నీటి విషయంలో తగిన బాధ్యత తీసుకొని మూసీ విషపు నీళ్లకు బదులుగా గోదావరి జలాలు అందించాలని నర్సింహ ప్రభుత్వాన్ని కోరినారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మాజీ జిల్లా కమిటీ సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, టౌన్ కార్యదర్శి దుబ్బాక జగన్, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, శాఖ కార్యదర్శి గూడూరు రాంరెడ్డి, టౌన్ కమిటీ సభ్యులు వడ్డెపల్లి యాదగిరి, నాయకులు గూడూరు క్రిష్ణా రెడ్డి, సామల సత్తిరెడ్డి, రామస్వామి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య సేవలకుగాను ప్రశంసా పత్రంతో పత్తిపాటి మంజులను సత్కరించిన భవానీ సాహిత్య అకాడమీ




**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం)మార్చి 29:** భవానీ సాహిత్య అకాడమీ కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రబాకర్ సంపాదకత్వంలో వెలువడిన "వందేమాతరం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగస్వామ్యమై,"వందేమాతరం" పై కవిత రచించి పంపి,ఆ పుస్తక ప్రచురణలో భాగస్వామ్యమైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజిక కార్యకర్త,కవయిత్రి మరియు ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజులని వారి సాహిత్య సేవలను అభినందిస్తూ ప్రశంసా పత్రంతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె పత్రికల ద్వారా ధన్యవాదాలు తెలిపారు.



# చంద్రాయన్ పల్లిలో అట్టహాసంగా బండ లాగుడు పోటీలు





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం మాడుగుల మండలం చంద్రాయన్ పల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం తన కుమారులు దోనాల బ్రదర్స్ శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీటీసీ జైపాల్ రెడ్డి హాజరై నిర్వాహకులు కృష్ణారెడ్డి తో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ.. గ్రామంలో రైతులందరితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా మంచి నిర్ణయం. ఇలాంటి కార్యక్రమాలు గ్రామంలో మరెన్నో చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా నని అన్నారు. ఈ దోనాలా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దోనాల బ్రదర్స్ ఆధ్వర్యంలో మా తండ్రి సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం శ్రీరామనవమి సందర్భంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆనందంగా ఉందని అన్నారు. మాడుగుల మండలం చంద్రాయన్ పల్లి గ్రామంలో మొట్టమొదటిసారిగా మా గ్రామంలో రైతన్నలు, యువకులు, ప్రజలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామస్తుల సమన్వయంతో మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న మొత్తం 13 జతలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ 10వేలు తిరుడు జంగయ్య యాదవ్ గెలుచుకోగా సెకండ్ ప్రైజ్ రూ. 5వేలు తిరుడు శ్రీను యాదవ్, మూడో బహుమతి రూ 3వేలు జెనిగల తానయ్య కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు వార్డు మెంబర్స్ మల్లేష్ కొండలు కుమార్ రాజు బద్రి శ్రీను బైక్ రవి చింటూ వెంకటేష్ గడుసు జగన్ సురేష్ ఎ.కొండల్ మహేష్ మల్లేష్ జెనిగల శ్రీశైలం జెనిగల తానయ్య జెనిగల చిన్నా తానయ్య బక్కయ్య వెంకటయ్య మల్లయ్య పగడాల బుర్ర శ్రీను రాజు వెంకటేష్ శివ రామకృష్ణ ఆర్ కె శ్రీను బైక్ శ్రీశైలం గ్రామ పెద్దలు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహాలక్ష్మి యాగంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ప్రత్యేక పూజలు

### ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో సుస్థిర అభివృద్ధి సాధ్యం



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 29: ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి సంకల్పంతో, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి యాగంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరిగినప్పుడే సమాజంలో శాంతి, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి యాగాలు రాష్ట్రానికి శాంతి, సమృద్ధి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, యాగ మహోత్సవ కమిటీ చైర్మన్ బండారు కుశలయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కోశాధికారి గందే రాము, ఆయిల్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రేపాల పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సూపర్ స్టార్' మేనిఫెస్టో విడుదల చేసిన డీఎంకే... ఓటర్లపై హామీల వర్షం!

### షార్ట్స్‌లో చూడండి

తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికల సమరం అధికారికంగా మొదలైంది. అధికార డీఎంకే పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ ఆదివారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం 'అన్నా అరివళయం'లో ఈ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ మేనిఫెస్టోను ఒక 'సూపర్ స్టార్'గా అభివర్ణించిన ఆయన, ఇది తమ పార్టీకి ఘన విజయాన్ని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేనిఫెస్టోలో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు పలు కీలక పథకాలను ప్రకటించారు. ముఖ్యంగా, ఆదాయపు పన్ను పరిధిలోకి రాని కుటుంబాల్లోని మహిళలకు 'ఇల్లతరసి' పథకం కింద గృహోపకరణాలు కొనుగోలు చేసేందుకు రూ. 8,000 విలువైన వన్‌టైమ్ కూపన్ అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ప్రస్తుతం మహిళా కుటుంబ పెద్దలకు ఇస్తున్న రూ. 1,000 నెలసరి ఆర్థిక సాయాన్ని రూ. 2,000కు పెంచుతామని ప్రకటించారు.రైతు సంక్షేమానికి కూడా డీఎంకే పెద్దపీట వేసింది. వరి క్వింటాల్ మద్దతు ధరను రూ. 3,500కు, చెరకు టన్ను ధరను రూ. 4,500కు పెంచుతామని హామీ ఇచ్చింది. వ్యవసాయానికి మీటర్లు లేని ఆధునిక పంపుసెట్లను ఉచితంగా అందిస్తామని తెలిపింది. ఇక సామాజిక భద్రతలో భాగంగా, వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను నెలకు రూ. 2,000కు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 2,500కు పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. యువత, విద్యార్థుల కోసం కూడా ఆకర్షణీయమైన హామీలు ఇచ్చారు. ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించే 35 లక్షల మంది విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తామని వాగ్దానం చేశారు. ఆరోగ్య రంగంలో, ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా పథకం కింద బీమా కవరేజీని రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు, పథకానికి అర్హత ఆదాయ పరిమితిని ఏడాదికి రూ. 5 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ఐదేళ్లలో 'కలైంజర్ కనవు ఇల్లం' పథకం ద్వారా 10 లక్షల కొత్త ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ, "సాధారణంగా ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టో హీరో అయితే, ఈసారి మా 'ద్రావిడ మోడల్ 2.0' మేనిఫెస్టో ఒక సూపర్ స్టార్" అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ మేనిఫెస్టోపై ప్రతిపక్ష పీఎంకే స్పందిస్తూ, 2021లో ఇచ్చిన 505 హామీల్లో 439 నెరవేర్చలేదని, వాటినే కొత్త మేనిఫెస్టోగా ప్రకటించి ఉండాల్సిందని విమర్శించింది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో డీఎంకే మేనిఫెస్టో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

# ఏకగ్రీవమైన టీఎన్జీవో రాష్ట్ర సంఘం ఎన్నికలు...

### అధ్యక్షునిగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఏం.హుస్సేనీ ముజీభ్ లు ఏకగ్రీవశీ...

### ఉద్యోగులకు అండగా ఉంటాం...

### సమస్యల పరిష్కారమే ఎజెండా...




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :** రాష్ట్రంలో ఉన్న ఉద్యోగుల పక్షాన నిలబడి వారిసమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడమే ఏకైక లక్ష్యమని టిఎన్జిఓస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం అయన యావత్ రాష్ట్ర సంఘశీ భాద్యులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల పక్షాన నిలబడి పోరాడేందుకు వెనక్కు వచ్చేప్రసక్తి లేదన్నారు. వారి సమస్యలే ఏకైక ఎజెండా అని అయన పేర్కొన్నారు. టీఎన్జీవో రాష్ట్ర సంఘం ఎన్నికలు ఆదివారం హైదరాబాద్ గచ్చిబచి?లీ లోని బి టి ఎన్ జి ఓస్ హౌసింగ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో జరిగాయి. వీటిలో ఎన్నికల అధికారిగా సుగుణాకర్ రెడ్డి, సహాయ ఎన్నికల అధికారి సురేష్ గారు వ్యవహరించారు. సింగిల్ సెట్ నామినేషన్ దాఖాలు కావడంతో రాష్ట్ర కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనది. దీన్ని ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీశ్వర్, ముజీబ్ టిఎన్జి ఓస్ రాష్ట్ర సంఘం ఎన్నికలు ఆదివారం హైదరాబాద్ లో జరిగాయి. వీటిలో నూతన అధ్యక్షునిగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ గార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గచ్చిబచి?లీలోని భాగ్యనగర్ హౌస్ బిల్డింగ్ సోసైటీ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా సింగిల్ సెట్ నామినేషన్ వచ్చినందున వారిరువురితో పాటు మొత్తం 17 మందితో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో నూతనంగా రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ గారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు అనంతరం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎచీ+హాం' అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి కొణిదెనా శ్రీనివాస్ , జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, కేంద్ర సంఘం కార్యదర్శి జడ్ ఎస్ జయపాల్, మరో కార్యదర్శి గంగవరపు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు...

**ఖమ్మం జిల్లాకు దక్కిన పదవి**

నూతనంగా జరిగిన ఎన్నికల్లో ఖమ్మం జిల్లాకు పదవి దక్కింది. ఆదివారం గచ్చిబచి?లీ లో భాగ్యనగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో కర్యాలయంలో జరిగిన టిఎన్జీ ఓస్ కేంద్ర సంఘం ఎన్నికల్లో జిల్లాకు చెందిన జడ్ ఎస్ జయపాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో కేంద్ర సంఘంలో జిల్లాకు స్థానం దక్కినట్టయింది...

# సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన చీమలపాడు పాపకొల్లు గుట్టల్లో అండర్ టేనల్ నిర్మాణం చేయాలి....

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

### నిర్వాసితులకు పరిహారం లో హెచ్చు తగులు తగదు

### రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుగ్గి కృష్ణ కొండేబోయిన నాగేశ్వరరావు



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన కారేపల్లి చీమలపాడు, పాపకొల్లు గుట్టల్లో అండర్ టేనల్ నిర్మాణం పనులు ప్రారంభం చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రైతు సంఘం బృందం చీమలపాడు వద్ద అండర్ టేనల్ నిర్మాణం చేయాల్సిన ప్రాంతంలో గుట్టలను జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా లో కామేపల్లి, కారేపల్లి రఘునాధపాలేం, ఖమ్మం రూరల్, తిరమలాయపాలెం ,కుసుమంచి మండలాల్లో భూములకు సాగునీరు అందించటం తోపాటు, నాగార్జున సాగర్ ఆయకట్టు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన ప్రధాన పనులు లో కారేపల్లి మండలం ఛీమలపాడు జూలూరుపాడు మండలం పాపకొల్లు గుంటల్లో అండర్ టేనల్ నిర్మాణం పనులు ప్రారంభం చేయాలి అని అన్నారు. ప్రభుత్వం మాత్రం దీర్ఘ కాలం పట్టే పనులు ప్రారంభం చేయకుండా కేవలం మట్టి కాలువలు త్రవ్వకం చేయడం ఆశ్చర్య పరుస్తుంది అని అన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం అండర్ టేనల్ నిర్మాణం చేయాలి ఉంది అని అన్నారు, ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా కేవలం మూడు వందల ముప్పై ఆరు కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని బడ్జెట్ ప్రతిపాదనలు సవరించి కేటాయింపులు పెంచాలి అని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులు నియోజకవర్గాల్లో సాగు భూములకు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గోదావరి జలాల అందించే అవకాశం ఉందని అన్నారు. ముగ్గురు మంత్రులు భాధ్యత వహించి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండేబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువలు నిర్మాణం కోసం భూ సేకరణ లో రైతులకు వేరు వేరు గా భూములు ధరలు నిర్ణయం చేసి పరిహారం అందించడం సరికాదని భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి తారతమ్యం లేకుండా ఎకరాకు ఇరవై ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, రైతు సంఘం నాయకులు మద్దెల నాగయ్య, ఎర్రిపోతు భద్రయ్య, సూరపాక ధనమ్మ, దారవత్ వినోద్, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.